సావిత్రి అప్పుడే వీథిలోనుంచి వచ్చింది.

ప్రకాశం దగ్గర కూర్చుని ఆడుకుంటున్న పిల్లలిద్దరూ సావిత్రిని చూసి చటుక్కున సావిత్రి దగ్గరకు పరుగెత్తారు. సావిత్రి వాళ్లిద్దరికీ చెరో చాక్లెట్టు చేతిలో పెట్టింది. దాన్ని నోట్లో పడేసుకుని వాళ్లు పక్కవాటాలోకి దూసుకుపోయారు.

సావిత్రి ఉస్సురంటూ కింద చతికిలపడి, "అబ్బబ్బ! ఏం ధరలండీ? బజారుకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. ధరలు ఇలా మండిపోతుంటే ఏం తింటాం? ఏం బతుకుతాం?" అంది దిగులుగా.

ప్రకాశానికి సావిత్రిని చూస్తే జాలేసింది.

"ఏదో ఒకటి తిని బతుకుదాంలేవే సావిత్రీ! నువ్వలా హైరానా పడిపోకు! ఏదీ దొరక్కపోతే అతనెవడో చెప్పాడు కదే బతికుంటే బలుసాకు తినొచ్చని, ఆ బలుసాకే తిని బతుకుదాంలే!"

"అదీ దొరక్కపోతే?" అనడిగింది సావిత్రి ఒళ్లుమండి.


ఆ ఆకు కాకపోతే మరే ఆకు తినాలో... జవాబు ప్రకాశానికే తెలియదు. అందుకే నోరు మూసుకుని ఊరుకున్నాడు.

కాస్సేపయ్యాక భోజనానికి పిలిచింది సావిత్రి.

"పిల్లలు భోంచేశారా?" అడిగాడు ప్రకాశం భోజనానికి లేస్తూ.

"వాళ్ల సంగతి తెలీనట్టు అడుగుతారేమిటి? వాళ్లకెంత సేపూ చిరుతిళ్లుంటే చాలు. వాళ్లకేం

# ఉట్టికెక్కలేనివాడు

సాయి బ్రోద్లర్

తొందరిప్పుడు? ఇప్పటిదాకా ఆగకుండా ఏవో తింటూనే ఉన్నారులెండి. కాస్సేపయ్యాక తింటారు."

ప్రకాశం భోంచేసి వచ్చి పేపరు ముందేసుకు కూర్చున్నాడు. పేపర్లో ఎవరో ప్రకృతి వైద్యం గురించి రాశారు. పదార్థాలు వండుకుని తింటే నోటికి కమ్మగా ఉంటుందే కానీ, ఒంటికి మంచిది కాదట. పదార్థాలను వండడంతో విటమిన్లు పోతాయి. వచ్చివే తింటే ఆరోగ్యం.

సావిత్రి వంటిల్లు చక్కబెట్టుకుని ఇవతలకొచ్చింది.

"డబ్బు చాలడంలేదని ఇదవుతున్నావు కదా! నేనో ఉపాయం చెప్పనా?" అన్నాడు సావిత్రిని చూసి.

"మీకు పుణ్యం ఉంటుంది, అదేదో తొందరగా చెబుదురూ!"

"రేపటి నుండి వంట మానెయ్యి, సావిత్రీ!"

సావిత్రి అయోమయంగా చూసింది.

"బియ్యం, పప్పులు ఖరీదుగా ఉన్నాయి కదా! అన్నమే తినాలని ఏముంది! ఇంకోటేదైనా తిందాం!" అన్నాడు.

"అలాగే! గడ్డి తిందాం!" అంది సావిత్రి వెక్కిరింపుగా.

ప్రకాశానికి కోపం వచ్చింది. "గడ్డి తింటే ఎంత ఆరోగ్యమో నీకేం తెలుసు?"

"అందుకే కాబోలు మనుషులకన్నా జంతువులే బలంగా ఉంటాయి."

సావిత్రి మాటలకు ప్రకాశానికి నవ్వొచ్చింది.

"నేను చెప్పేది వినిపించుకో! ఇంతింత కారాలవీ తినడం మంచిది కాదు. తిండి అంటే అన్నమేనా? పళ్లు లేవా? పాలు లేవా? ఇక నుంచి మనం పళ్లు తిని, పాలు తాగుదాం! కిరసనాయిలి ఖర్చు కూడా తగ్గుతుంది."

"ఉపవాసాలుండమంటే పిల్లలుండగలరాండీ?"

"ఉపవాసం ఏమిటి సావిత్రీ? ఎంతకావాలంటే అంత తినొచ్చు. వాళ్లకు అన్నం అంటే ఇష్టం లేదని ఇందాక నువ్వే అన్నావుగా? బలవంతం ఎందుకు? అసలు వంట చేయడంవల్ల విటమిన్లన్నీ పోతాయట!"

సావిత్రికి ప్రకాశం ధోరణేమీ అర్థం కావడంలేదు.

"బొత్తిగా వండుకోవడం మానేస్తే వాళ్లు అన్నానికి మొహంవాచిపోరటండీ? విటమిన్ల సంగతి వాళ్లకేం తెలుస్తుంది?"

"వాళ్లకు తెలీదు కాబట్టే మనం జాగ్రత్త పడాలి. వాళ్లకి ఏది అలవాటు చేస్తే అదే అలవాటైపోతుంది. నువ్వు వంట మానేసెయ్!" అన్నాడు ప్రకాశం సీరియస్‌గా.

"బాగానే ఉంది వెర్రి!" అంటూ సావిత్రి లేచి వెళ్లిపోయింది.

***

మర్నాడు ప్రకాశం లేచేటప్పటికి బాగా ఎండెక్కింది. ప్రకాశం మొహం కడుక్కుని వచ్చేసరికి సావిత్రి కాఫీ గ్లాసు పట్టుకొచ్చింది. ప్రకాశం అలవాటుగా కాఫీ నోటి దగ్గర పెట్టుకోబోయి చటుక్కున వెనక్కి పెట్టేశాడు.

"కాఫీ చేసేవేమిటి? నిన్న అనుకున్నదేమిటి? అన్నం కూడా వండేశావా?" అనడిగాడు ప్రకాశం కోపంగా.

సావిత్రి తెల్లబోతూ, "ఏదో సరదాకన్నారనుకున్నాను!" అంది.

ప్రకాశం రివ్వున వంటింట్లోకెళ్లి అన్నం గిన్నె తెచ్చి సావిత్రికిస్తూ, "ముందు ఆ అన్నం అంతా కుడితిలో పారేసిరా!" అన్నాడు ఆజ్ఞాపిస్తున్న ధోరణిలో.

"ఏదో తెలీక వండేశాను. ఇప్పుడదంతా పారబోసుకోవడం ఎందుకు? రేపటినుండి మానేస్తానులెండి!" అంటూ సావిత్రి నచ్చచెప్పబోయింది.

సావిత్రికి ఆ పంతం ఏమిటి? తనేం పస్తుండమంటున్నాడా? శుభ్రంగా కడుపునిండా తినమనే అంటున్నాడు. కాకపోతే వండినవి మాత్రం తినొద్దంటున్నాడు. ఆకలి తట్టుకోవడానికి ఏదో ఒకటి తినాలి కానీ, ఫలానాదే కావాలని ఆ మంకుపట్టేమిటి?

"నీకిష్టం లేకపోతే నేనే పారేసి వస్తాను!" అంటూ ప్రకాశం సావిత్రి చేతిలోని గిన్నె గుంజుకోబోయాడు.

"నేనే పారేస్తాన్లెండి!" అని, గిన్నె పట్టుకుని బయటకు వెళ్లింది. పారేసి వచ్చింది.

ప్రకాశం నాలుగు రకాల పళ్లు తీసుకొచ్చి, ఇంట్లో పడేశాడు. పిల్లలు వాటిమీదకి ఎగబడ్డారు.

"పిల్లలు చూశావా, ఎంత సరదాగా తింటున్నారో!" అన్నాడు ప్రకాశం పిల్లల్ని తృప్తిగా చూస్తూ.

సావిత్రి మాట్లాడలేదు.


ప్రకాశం అరడజను అరటిపళ్లు తిని, గ్లాసుడు పాలుతాగి ఆఫీసుకెళ్లిపోయాడు.

పిల్లలిద్దరూ పళ్లన్నీ అలా ఎగబడి తింటుంటే వాళ్లకి ఎక్కడ జబ్బు చేస్తుందోనని సావిత్రికి భయం వేసింది.

ఆకలి వేసినప్పుడు సావిత్రి రెండు అరటిపళ్లు తింది. కానీ ఆకలి తగ్గినట్టనిపించలేదు. అన్నం తిన్నాక ఒకటి రెండు పళ్లు తింటే బాగుంటుంది కానీ, బొత్తిగా పళ్లు తినమంటే తినబుద్ధి పుడుతుందా? ఇంట్లో ఇంకా కొద్దిగా బియ్యం ఉన్నాయి. వండుకుని తింటేనో? ప్రకాశం చూడొచ్చాడా అనుకుంది, కానీ అంతలోనే ఆ బియ్యం ఉంటే పిల్లలు అడగకమానరు. అపుడు పిల్లలకైనా రెండు రోజులు వండి పెట్టొచ్చని ఊరుకుంది.

అనుకున్నట్టే పిల్లలు రెండు రోజులవరకూ ఎటువంటి పేచీలూ పెట్టలేదు. మూడోరోజున వాళ్లు అన్నం పెడతావా, పెట్టవా? అని పీకలమీద కూర్చున్నారు. పళ్లు తినీ తినీ వాళ్లకు మొహం మొత్తింది.

ఏ పళ్లు కావాలన్నా తెచ్చిపెడతానని బతిమాలాడు ప్రకాశం. కానీ వాళ్లు అన్నమే కావాలని పట్టుబట్టారు. ప్రకాశానికి ఒళ్లుమండి, చెరొకటీ తగల్నిచ్చి ఆఫీసుకెళ్లిపోయాడు. ఉష, రవి, ఏడ్చి ఏడ్చి అలసిపోయి నిద్రపోయారు. వాళ్లను చూస్తుంటే సావిత్రికి గుండె



తరుక్కుపోయింది. రవికి మొన్ననే మూడేళ్లు వెళ్లాయి. ఉష వాడికన్నా ఏడాది పెద్దది. విటమిన్లు, ఆరోగ్య సూత్రాలు ఇవన్నీ వాళ్లకేం తెలుస్తాయి?

సావిత్రి లేచి గబగబా స్టౌ అంటించి ఎసరు పడేసింది.

వంట అయిపోయాక పిల్లలిద్దర్నీ లేపి అన్నం తినిపించింది. వాళ్లు మళ్లీ మళ్లీ మారు వేయించుకుని అన్నం తృప్తిగా తిన్నారు.

"నాన్నగారితో అన్నం తిన్నట్టు చెప్పకండేం? కోప్పడతారు!" అని చెప్పింది సావిత్రి. అలాగే అన్నారు ఇద్దరూ.

తనకూ అన్నం తినాలనిపించినా నిగ్రహించుకుంది సావిత్రి. ఈ కాసిని బియ్యమూ అయిపోతే పిల్లలకేం పెట్టాలి? తనమీద నమ్మకం లేక ప్రకాశం తనకు డబ్బివ్వడం మానేశాడు.

ప్రకాశం రాగానే రవి గబగబ ప్రకాశం దగ్గరకెళ్లి, "నేనూ, అక్కా ఎంచక్కా పప్పుబువ్వ తిన్నాంలే!" అంటూ ఊరించాడు.

సావిత్రి ప్రకాశం ఏం చేస్తాడోనని హడలిపోయింది. కానీ ప్రకాశం కొట్టనూలేదు, తిట్టనూలేదు.

"వద్దంటే తిన్నారూ? రేపటినుండి తినకండేం!" అన్నాడు ప్రకాశం సౌమ్యంగా.

అసలు విషయం ఏమిటంటే ప్రకాశానికికూడా ఎన్ని పళ్లు తిన్నా అన్నం తిన్నట్టు ఉండటంలేదు. ఒక్కరోజుకే అని సర్దిచెప్పుకుని మధ్యాహ్నం హోటల్లో భోంచేశాడు.

***

సావిత్రి అత్తగారు రాజేశ్వరమ్మ ఊరినుండి వచ్చింది.

సావిత్రి ఆవిడ్ని చూడగానే గతుక్కుమంది. బియ్యం డబ్బా రెండు రోజుల క్రితమే ఖాళీ అయింది.

సావిత్రి ప్రకాశాన్ని చాటుగా పిలిచి చెప్పింది "బియ్యం ఒక శేరైనా తెచ్చిపెట్టండి. అత్తయ్యకైనా వండిపెట్టాలి కదా!"

"అమ్మకుమటుకే. పిల్లలని అటు వెళ్లనివ్వకు!" అంటూ బజారుకెళ్లి బియ్యం తెచ్చాడు.

రాజేశ్వరమ్మ బియ్యం కొలవబోతుంటే, "మీ ఒక్కరికే వేసుకోండత్తయ్యా! మేం ఎవ్వరం అన్నాలు తినం!" అంది సావిత్రి.

రాజేశ్వరమ్మ ఆశ్చర్యపోయింది. "అదేమిటి?"

"ఆయనకీమధ్య జబ్బు చేసిందత్తయ్యా! డాక్టరు అన్నం తినొద్దన్నాడు!"

"అంత జబ్బు చేస్తే నాకు రాయలేదేమే?"

"జబ్బంటే జబ్బు కాదులెండి! తింటూ తిరుగుతూనే ఉన్నారు!"

రాజేశ్వరమ్మకు అదేం జబ్బో అంతుబట్టలేదు.

"వాడికి జబ్బయితే నీకూ, పిల్లలకీ ఏమి?"

"వద్దులెండత్తయ్యా! మాకు పాలూ, పళ్లూ ఉన్నాయి. పిల్లలు అన్నం అంటే అంత ఇష్టంగా తినరు. నాకూ సయించడంలేదు!"

"అలాగటే, నాకు తెలీనే తెలీదు! ఎన్నో నెల?" అనడిగింది రాజేశ్వరమ్మ సంతోషంగా.

సావిత్రి కంగారుగా "అబ్బే, అదేం లేదండీ! ఊరికే ఒంట్లో బాగుండటంలేదు!" అంటూ అక్కడనుంచి వెళ్లిపోయింది.

రాజేశ్వరమ్మ అన్నం తింటున్నప్పుడు పిల్లల్ని అటు వెళ్లనివ్వకూడదని సావిత్రి ఎంతో తంటాలు పడింది. కానీ సమయానికి వాళ్లు అక్కడకు వచ్చి ఆవిడ తింటున్న అన్నం కేసి ఉసూరుమని చూస్తూ దూరంగా నిలబడ్డారు.

రాజేశ్వరమ్మ వాళ్లను పిలిచి, గోరుముద్దలు తినిపించింది.

"పిల్లలు ఆవురావురుమని ఎలా తింటున్నారో చూశావా? పాపం, వాళ్లకి తిండి పెట్టకుండా మాడ్చి చంపుతున్నావేమిటే?" అనడిగింది కోపంగా.

సావిత్రి మాట్లాడకుండా ఊరుకున్నది.

సావిత్రి తనతో సరిగా మాట్లాడకపోవడమూ, అన్నం తినడం మానెయ్యడం ఇవన్నీ చూసి రాజేశ్వరమ్మ, తనుండటం సావిత్రికి ఇష్టం లేదనుకుని పట్టుమని నాలుగు రోజులైనా ఉండకుండానే ఊరెళ్లిపోయింది.

***


పిల్లల్ని చూస్తుంటే సావిత్రికి కడుపు

## ఊర్మిళ లవర్‌రాముకాదట!

శేఖర్‌కపూర్ చిత్రం 'మాసూమ్' నటించినప్పటి నుంచి నేటి లేటెస్ట్ చిత్రం 'చమత్కార్' వరకూ చాలా దూరం ప్రయాణించింది ఊర్మిళామాతోండ్కర్. అంతే కాదు, తాను ఎంచుకున్న వృత్తి పట్ల ఎంతో అంకితభావంతో, కఠినపరిశ్రమ చేస్తుంది. అదే ఆమె కీర్తిప్రతిష్ఠలకు కారణమైంది. 'చమత్కార్' హీరో సంజయ్‌దత్ ఆమెను గురించి తమాషాగా ఇలా అంటున్నాడు -"రామ్‌గోపాల్‌వర్మతో ఆమెకున్న సంబంధాలను గురించి అంతా ఏమేమో చెప్పుకుంటుంటారు. కానీ, గుర్తుంచుకోవలసి విషయం ఒక్కటే. ప్రేక్షకులు ఆమెను ప్రేమించి, ఆమె నటించిన చిత్రాలు చూస్తున్నంతవరకూ ఆమెకేం ఢోకా లేదు. పైగా ఆమెను ఏ దర్శకుడూ ప్రేమించాల్సిన అవసరమూ లేదు!" బాగుంది కదూ?

ఎస్.





తరుక్కుపోతున్నది. రెండు రోజులుగా ఇంట్లో పిడికెడు బియ్యమైనా లేవు. పిల్లలు రోజురోజుకీ చిక్కిపోతున్నారు. తన దగ్గర డబ్బుల్లేవు. అప్పు తెస్తే... ఎవరిని అడగడం? తీర్చడం ఎలా? శ్యామల సాయం చెయ్యకపోదు కానీ ఏం చెప్పడం? ప్రకాశం తనను, పిల్లల్ని అన్నం తిననివ్వడంలేదని చెబితే నవ్వుతుందేమో? ఏం చెయ్యడానికీ తోచడంలేదు.

అడబోయిన తీర్థం ఎదురైనట్టు ఆ రోజు మధ్యాహ్నమే శ్యామల సావిత్రి ఇంటికొచ్చింది.

"అదేమిటే, పుల్లలా తయారయ్యావు? తిండి తినడంలేదా?" అనడిగింది శ్యామల.

సావిత్రి నవ్వి, అసలు సంగతి చెప్పనా, వద్దా అని మధనపడుతున్నంతలో "రేపు మా అక్క కూతురి పెళ్లి. పిల్లల్ని, మీ వారిని తీసుకుని రావే! భోజనాలు అక్కడే! నేనింకా చాలా ఇళ్లు పిలవాలి!" అంటూ వెళ్లిపోయింది.

పోనీ, రేపైనా పిల్లలు, తను తృప్తిగా తినొచ్చు అనుకుంది సావిత్రి.

మర్నాడు ప్రకాశం ఆఫీసుకెళ్లిపోయాక సావిత్రి పిల్లల్ని తీసుకుని పెళ్లివారింటికి వెళ్లింది. శ్యామల పలకరించి వాళ్లని లోపలికి తీసుకెళ్లింది. కాసేపయ్యాక భోజనాలకు పిలుపు వచ్చింది. పిల్లలతోపాటు భోజనాలకు వెళ్లబోయేసరికి ప్రకాశం కనపడ్డాడు. సావిత్రి ఉలిక్కిపడి నించున్నచోటే ఉండిపోయింది.

ప్రకాశం చూసి, దగ్గరకొచ్చి "మీరెప్పుడొచ్చారు, సావిత్రీ?" అని పలకరించాడు.

"ఇప్పుడే! మీరెప్పుడొచ్చారు?" అనడిగింది సావిత్రి నీరసంగా.

"నేనూ ఇప్పుడే. పెళ్లికొడుకు నా స్నేహితుడేలే ... నువ్వింకా ఉంటావా, నాతో వస్తావా?"

సావిత్రి తటపటాయిస్తూ "కాస్సేపు ఉండి వస్తాంలెండి!" అంది.

"అయితే నేనూ ఉంటానులే. అందరం కలిసే వెళ్లిపోదాం!"

సావిత్రి రాబోతున్న నిట్టూర్పును లోలోనే అణిచేసుకుని, "పదండి వెళ్లిపోదాం! ఇంకా ఇక్కడుండి ఏం చేస్తాం?" అంటూ శ్యామలకు చెప్పకుండానే, పిల్లల్ని తీసుకుని ప్రకాశంతో ఇంటికెళ్లిపోయింది.

నీరసంగా కనపడుతున్న సావిత్రిని, పిల్లల్ని చూస్తుంటే ప్రకాశానికి తను చేస్తున్నది తప్పేమో అనిపించింది. కానీ ఇందులో తప్పేముంది? వాళ్లు ఆరోగ్యంగా ఉండటమే తనకు కావాల్సింది. ఆ మాటకొస్తే మనుషులందరూ అలా ఉండాలనే తన కోరిక. ముందు పెళ్లాం, పిల్లలచేత ఈ తిండి మానిపిస్తే తర్వాత ప్రజలు. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కినట్టు ఇంట్లోవాళ్ల సంగతే చూసుకోలేకపోతే ప్రపంచాన్నేం ఉద్ధరిస్తాడు?

***

పెళ్లి హడావుడి తగ్గిపోయాక శ్యామల సావిత్రి ఇంటికొచ్చింది "అదేమిటే! పెళ్లికొచ్చి భోం చేయకుండానే వెళ్లిపోయావు? నీ కోసం ఎంతసేపు వెదికాననీ!"

"భోజనంలాగే ఉందిలేవే బతుకు!" అంది సావిత్రి విసుగ్గా.

శ్యామల గతుక్కుమని, "ఏమైందే?" అనడిగింది ఆత్రుతగా.

"అన్నం అదీ తింటే ఒంటికి మంచిది కాదని ఆయనెక్కడో పేపర్లో చదివారట! అప్పటినుంచి అన్నం తినకూడదని శాశించారు. పిల్లలిద్దరూ అన్నానికి మొహం వాచి ఉన్నారనుకో!" అంటూ అంతా చెప్పి భోరున ఏడ్చింది.

శ్యామల ఎంతో నొచ్చుకుంది. "మీ ఆయనకేమైనా మతిపోయిందా? తిండి కూడా తిననివ్వకపోతే ఇంకేం మొగుడే? కొన్నాళ్లపాటు నువ్వూ, పిల్లలూ మా ఇంటికొచ్చి ఉండండి!"

"ఏందుకులే, శ్యామలా! లేనిపోని గొడవలు ... నాకాయన డబ్బు కూడా ఇవ్వడం మానేశారు. డబ్బుంటే బియ్యం తెచ్చి పిల్లలకైనా చాటుగా ఇంత తిండి పడేసేదాన్ని."

"డబ్బుదేవుందిలే, నేనిస్తాను తీసుకో!" అంది శ్యామల.

సావిత్రి నిట్టూర్చింది.

"నువ్విస్తావులేవే! కానీ ఎన్నాళ్లని అప్పు తీసుకోను? తీసుకున్న అప్పు ఎలా తీర్చను?"

"అదంతా తర్వాత చూసుకుందాంలేవే, సావిత్రీ! అతనికీ పిచ్చి ఎన్నాళ్లో ఉండదులే! నువ్వూ, పిల్లలూ రోజూ శుభ్రంగా అన్నం వండుకు తినండి. అతనికి ఎన్నాళ్లని భయపడతావు? ప్రస్తుతానికి ఇది ఉంచుకో!" అంటూ సావిత్రి చేతిలో వందరూపాయల నోటు పెట్టి వెళ్లిపోయింది శ్యామల.

సావిత్రి రోజూ ప్రకాశం ఆఫీసుకెళ్లిపోయాక గబగబా వంట వండేసి, పిల్లలకింత పెట్టి తనింత తింటున్నది. మళ్లీ సాయంత్రం ప్రకాశం ఇంటికొచ్చేలోగా అన్నం వండుకుని తిని, గిన్నెలన్నీ కడిగి లోపల దాచేస్తున్నది. ఈ దొంగ బతుకెన్నాళ్లని విసుగ్గా ఉంది సావిత్రికి.

ఒకరోజు సాయంత్రం సావిత్రి పిల్లలిద్దరికీ అన్నాలు పెట్టి వాళ్లు తిన్నాక తను అన్నం ముందు కూర్చున్నది. ఆవకాయ కలుపుకుని ముద్ద నోట్లో పెట్టుకోబోతున్నది. సరిగ్గా ఆ సమయంలోనే ఎవరో తలుపు తట్టారు. సావిత్రి కంగారుపడుతూ లేవబోయేంతలో పిల్లలు తలుపు తియ్యడం, ప్రకాశం సరాసరి వంటింట్లోకి రావడం జరిగిపోయింది.

ప్రకాశాన్ని చూసి సావిత్రి ప్రాణాలు పైకి ఎగిరిపోయాయి.

ఆవకాయ కలిపిన అన్నం ఎర్రగా నూనె కారుతూ నోరూరిస్తున్నది. ప్రకాశం చటుక్కున పీట వాల్చుకుని, "అన్నం ఉంటే నాకూ పెట్టు సావిత్రీ! ఆవకాయ వేసుకుని తినాలనుంది. జబ్బు చేస్తే డాక్టర్లున్నారు. వాళ్లు బాగు చేస్తారు. నా పిచ్చి సిద్ధాంతాలతో నిన్ను యమయాతన పెట్టాను కదూ!" అన్నాడు పశ్చాత్తాపంతో.

కలో, నిజమో తేల్చుకోలేని అయోమయావస్థలో సావిత్రి చాలాసేపు ప్రకాశాన్ని కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది.

■

